క్లుప్తంగా

స్త్రీ, పురుష సమానత్వంపై అవగాహన



బలిజిపేట ఉన్నత పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు

బలిజిపేట: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో జెండర్‌పై అవగాహనా కార్యక్రమాలను మండల సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. స్త్రీ, పురుషుల సమానత్వం, గృహ హింస లేకుండా చేయడం, బాల్య వివాహాలు అరికట్టడం, మహిళావేధింపులు లేకుండా చూడడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అందులో భాగంగా బలిజిపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థినులచేత ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థినులు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగిఉండాలని సూచించారు. కార్యక్రమంలో వీఓఏలు, మహిళాసంఘాల సభ్యులు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహ స్వామికి ప్రత్యేక అలంకరణ



భక్తులకు దర్శనమిచ్చిన లక్ష్మీనృసింహస్వామి

సీతానగరం: మండలకేంద్రంలోని సువర్ణముఖి నదీ తీరాన వేంచేసిన లక్ష్మీనృసింహ స్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు గురువారం దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు పి.శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులు పూజించడానికి సిద్ధం చేయడంతో దూరప్రాంతాల నుంచి వచ్చిన వారంతా స్వామి దర్శనానికి క్యూకట్టారు. స్వామి వారిని దర్శించుకున్న భక్తులతో ముడుపులు చెల్లింపు, క్షీరాభిషేకాలు, కుంకుమపూజలను అర్చకులు చేయించారు. ఉపవాసాలతో ఆలయానికి చేరుకున్న భక్తులకు ఆలయ ప్రాంగణంలో తీర్థప్రసాదాల వితరణ చేశారు.

60 బస్తాల పీడీఎస్ బియ్యం పట్టివేత



వ్యాన్‌తో పట్టుబడిన బియ్యం

సీతంపేట: మండలంలోని చిన్నరామ జంక్షన్ వద్ద 60 బస్తాల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై జగదీష్ నాయుడు తెలిపారు. వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో దోనుబాయి నుంచి సీతంపేటకు పికప్ వ్యాన్‌తో 2,269 కిలోల రేషన్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తుండగా పట్టుకున్నామని చెప్పారు. సీజ్ చేసిన బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ గొడౌన్‌కు అప్పగించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉపర్నాయుడువలసలో వెల్లివెరిసిన ఆధ్యాత్మికత



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

రేగిడి: మండలంలోని ఉప్పర్నాయుడువలసలో పొగిరి, కరణం కుటుంబీకుల ఇలవేల్పులైన చిన్నప్పమ్మ, నారాయణమ్మ పేరంటాల గుడుల ప్రారంభోత్సవాలు గురువారం అంగరంగవైభవంగా నిర్వహించారు. సర్పంచ్ కరణం గోవిందరావు, ఎంపీటీసీ సభ్యుడు పొగిరి అప్పలనాయుడుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున వేడుకలు జరగడంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివెరిసింది. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో కరణం సూర్యారావు, కరణం రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలను అభివృద్ధిపథంలో నడపాలి

- ఎంపీడీఓ బాసూరి శంకరరావు

రాజాం: పంచాయతీలను అభివృద్ధిపథంలో నడపాలని.. ఇందుకోసం పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు ప్రధానపాత్ర పోషించాలని ఎంపీడీఓ బాసూరి శంకరరావు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలతో సమీక్షించారు. నిధులు సమీకరించడం.. వాటిని సక్రమంగా ఖర్చు చేయడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు, ఈఓపీఆర్‌డీఓ యాలాల వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథిని మళ్లీ ఆశీర్వదించండి



పార్వతీపురం టౌన్: ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: కుల, మత రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న సంక్షేమ సారథి సీఎం జగనన్నను మళ్లీ ఆశీర్వదించాలని ఎమ్మెల్యే జోగారావు కోరారు. ఈ మేరకు పార్వతీపురం మండలం పుట్టూరు గ్రామ సచివాలయ పరిధిలో గురువారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని, సంక్షేమ,అభివృద్ధి పథకాల లబ్ధిని తెలియచేసే డిస్ ప్లే బోర్డ్‌ను ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పుట్టూరు గ్రామ సచివాలయ పరిధిలో అభివృద్ధికోసం నిధులు రూ. 21.03 కోట్లు వెచ్చించామని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలకు చేదోడు వాదోడుగా నిలిచి, ప్రజలందరి మద్దతు పొందుతూ పేదవాడి మనసు గెలుచుకున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డేనన్నారు.



సీతానగరం: పెదభోగిలిలో సంక్షేమపథకాల డిస్‌ప్లేను ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ ఎం బాబ్జీ, వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకుడు బి శ్రీరాములునాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు బి చిట్టిరాజు

ఇన్ని సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేసి సామాజిక సమతుల్యతను తీసుకువస్తూ పేద, బడుగు, బలహీన వర్గాలకు అన్ని విధాలా అండగా నిలుస్తున్నందున మళ్లీ సీఎంగా రాష్ట్రానికి జగన్‌మోహన్ రెడ్డే కావాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, ఎంపీపీ మజ్జి శోభారాణి, జెడ్పీటీసీ బలగ రేవతమ్మ, వైస్ ఎంపీపీ బి.రవికుమార్, స్థానిక ఎంపీటీసీ వై. వెంకటరమణ, సర్పంచ్ జి. సతీష్ కుమార్, పీఏసీఎస్ చైర్మన్ కాపారపు సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బి.కృష్ణమూర్తి, పార్టీ జనరల్ సెక్రటరీ వి.గురురాజు, వివిధ గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, జేసీఎస్ కన్వీనర్ బి. వాసుదేవరావు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



బలిజిపేట: సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించిన వైఎస్సార్‌సీపీ బలిజిపేట మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, పార్టీ నాయకులు



సాలూరు: మండలంలోని మరిపల్లి వద్ద సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న వైస్ఎంపీపీ రెడ్డి సురేష్, ఏఎంసీ చైర్‌పర్సన్ దండి అనంతకుమారి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు సువ్వాడ భరత్ శ్రీనివాస్ తదితరులు

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం



సీడీపీఓ అనంతకుమారి

మక్కువ: మండలంలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పాచిపెంట సీడీపీఓ బి.అనంత కుమారి గురువారం తెలిపారు. పాపయ్య వలస, మోసూరు వలస అంగన్వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న రెండు వర్కర్స్ పోస్టులకు, ఎ.వెంకంపేట అంగన్వాడీ కేంద్రంలో హెల్పర్ పోస్టుకు అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆమె చెప్పారు. వాటికి సంబంధించిన నోటిఫికేషన్ ఇప్పటికే ఇచ్చినట్లు పేర్కొన్నారు. అర్హత గల అభ్యర్థులు 1/07/2023 నాటికి 21 సంవత్సరాలు పూర్తయి, 35 సంవత్సరాల లోపు వయస్సు కలిగి ఉండాలని, అలాగే ఆయా గ్రామాలకు చెందిన వివాహితులై ఉండాలని స్పష్టం చేశారు. 10 వ తరగతి అర్హత కలిగి, కుల, నివాస ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ కాపీలు అటస్టేషన్ చేసి, అర్హత కలిగిన అభ్యర్థులు 14/12/2023 సాయంత్రం 5 గంటలలోగా పాచిపెంట ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలని ఆమె కోరారు.

ట్రాన్స్ జెండర్లకు హెపటైటిస్ పరీక్షలు



ట్రాన్స్‌జెండర్లకు హెపటైటిస్ పరీక్షలు చేస్తున్న సిబ్బంది

పార్వతీపురంటౌన్: జిల్లా ఆస్పత్రిలో గల ఏఆర్‌టీ సెంటర్‌లో గురువారం ట్రాన్స్ జెండర్లకు హెపటైటిస్ బి,సి పరీక్షలను జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ పి.బాలాజీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. అనంతరం హెపిటైటిస్ బి.వ్యాక్సిన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాన్స్ జెండర్లకు ఉచితంగా హెచ్ఐవీ, సిఫిలిస్ పరీక్షలు నిర్వహించామన్నారు. ఎయిడ్స్ లాంటి వ్యాధులకు గురికాకుండా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇటువంటి చర్యలు చేపడుతోందన్నారు. కార్యక్రమంలో ఏఆర్‌టీ కౌన్సిలర్ జి. శారద, ప్రాజెక్టు మేనేజర్ శ్రీకాంత్, వైడీఓ నెట్‌వర్క్, స్వచ్ఛంద సంస్థలు, ఏఆర్‌టీ ప్రోగ్రాం ఆఫీసర్ సోనిలాల్ తదితరులు పాల్గొన్నారు.

పండ్లతోటల పెంపకంపై రైతుల ఆసక్తి



పెద్దూరులో సాగు చేస్తున్న మామిడి తోట

గరుగుబిల్లి: మండలంలోని పెద్దూరు, గొట్టివలస, గరుగుబిల్లి, ఉల్లిబద్ర, రావుపల్లి గ్రామాల్లోని రైతులు పండ్లతోటల పెంపకంపై ఆసక్తి చూపిస్తున్నారు. మెట్టు పొలాల్లో మామిడి, జీడి, నీలగిరి తోటలు వేసేందుకు రైతులు ముందుకువస్తుండడం విశేషం. ఉలిబద్ర మీదుగా గరుగుబిల్లి వరకు జంఝావతి కాలువను ఏర్పాటు చేసినప్పటికీ సాగు నీరు పుష్కలంగా సరఫరా కావడం లేదు. దీంతో రైతులు ఏటా ఖరీఫ్ సీజన్‌లో వరి పంటను పూర్తిస్థాయిలో సాగుచేయడం లేదు. వర్షాభావ సమయంలో నీటి తడులు అందకపోతే వరి పంటకు నష్టం జరుగుతుండడంతో పూర్తిస్థాయిలో పండించడం లేదు. మెట్టు భూముల్లో వేసిన గోగు పంట గిట్టుబాటు కాకపోవడంతో దాదాపు గోగుపంటను సాగు చేయడం లేదు. ఈ కారణంగా రైతులు ప్రత్యామ్నాయ పంటలైన నీలగిరి, పత్తి, పామాయిల్ తదితర పంటలతో పాటు పండ్ల తోటలను కూడా సాగుచేస్తున్నారు. ఈ పంటల వల్ల ఏటా పంట పెట్టుబడులు పెట్టనవసరం లేదని, దీంతో సాగు సులభంగా ఉందని రైతులు చెబుతున్నారు.

వినియోగదారుల హక్కులు, చట్టాలపై అవగాహన సదస్సు



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు, కళాశాల సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ జూనియర్ కళాశాల(బాలురు)లోని విద్యార్థులకు వినియోగదారుల హక్కులు, చట్టాలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సమాచార కేంద్ర నిర్వాహకురాలు పట్నాయకుని నాగమణి మాట్లాడుతూ వినియోగదారుల చట్టాలు, హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండడం అవసరమన్నారు. మనం కొనుగోలు చేసే ప్రతీ వస్తువు నాణ్యత, పరిమాణం, ధరలు, కాలం చెల్లిన తేదీ చూసుకోవాలని, వాటిల్లో తేడా ఉంటే సంబంధిత విక్రయదారుపై ఫిర్యాదు చేసేందుకు వినియోగదారుడు కన్స్యూమర్ కోర్టును ఆశ్రయించి, న్యాయం పొందవచ్చన్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ఈ తరహా కోర్టులు ఉన్నాయన్నారు. రాతపూర్వకంగా గానీ ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. టోల్‌ఫ్రీ నంబర్లు 1967, 18004250082 సంప్రదించి, ఫిర్యాదుపై సలహాలు, సూచనలు పొందవచ్చన్నారు. అనంతరం వినియోగదారుల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పిస్తూ రూపొందించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ యుగంధర్, వినియోగదారుల సంఘం డివిజన్ అధ్యక్షుడు గుడ్ల హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు



రుద్రాక్షలతో పూజలు చేస్తున్న దృశ్యం

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని దాడితల్లి ఆలయంలో కొలువైన సుబ్రహ్మణ్యస్వామికి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. కాశీ నుంచి తెప్పించిన 1,108 రుద్రాక్షలతో పురోహితులు పిండిప్రోలు మణికుమార్ ఆధ్వర్యంలో స్వామి వారికి పూజలు చేశారు. దేవుని అనుగ్రహం రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని వేడుకున్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

బొబ్బిలి: స్థానిక విద్వాన్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 8వ తేదీన జరిగే మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ నేత, కళాశాల కరస్పాండెంట్ శంబంగి శ్రీకాంత్ గురువారం ఓ ప్రకటనలో కోరారు. 13 కంపెనీలు 1200 ఉద్యోగాల కోసం అభ్యర్థులను ఇంటర్వ్యూ చేయడం జరుగుతుందని, పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బి-ఫార్మసీ, బీటెక్ చదివిన వారు అర్హులన్నారు. ఎంపికైన వారికి విజయనగరం, విశాఖపట్నం, తుని, కడప, తిరుపతి, విజయవాడ, హైదరాబాద్‌లో ఉద్యోగం ఇవ్వడం జరుగుతుందన్నారు.

అధికారుల పరిశీలన

బొబ్బిలి: మండలంలోని కారాడ, పిరిడి ప్రాంతాల్లోని రక్షిత మంచినీటి పథకాలతో పాటు వాటికి నీటిని తీసుకువెళ్లే మోటార్ పంపులను ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ పీఎంకే రెడ్డి, ఏఈ శ్రావణ్‌కుమార్ గురువారం పరిశీలించారు. మిచాంగ్ తుపాను వర్షాల కారణంగా ఎక్కడైనా ఏవైనా దెబ్బతిన్నాయా లేదా అనే విషయం గమనించామని, అంతా బాగానే ఉందని వారు తెలిపారు. కార్యక్రమంలో ఏఈ శ్రావణ్‌కుమార్ తదితరులున్నారు.

పాముకాటుతో మహిళ మృతి

రేగిడి: మండలంలో సరసనాపల్లి గ్రామానికి చెందిన కుప్పల నారాయణ అనే మహిళా రైతు పాముకాటుతో మృతి చెందింది. గురువారం ఉదయం పంట పొలంలో వరి పనులు ఆరబెడుతుండగా.. పాము కరవడంతో ఆమెను 108 వాహనంలో రాజాం సామాజిక ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం కిమ్స్‌కు తరలించారు. ఇక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది.

భక్తిశ్రద్ధలతో జై గురుదత్త హోమం



ఆలయంలో హోమం చేస్తున్న భక్తులు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని శ్రీషిర్డీసాయి మందిరంలో దేవీ సహిత జై గురుదత్త హోమం గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, కాగడహారతి, విశేషార్చనలు, అభిషేకాలు చేశారు. వీరఘట్టం ప్రాంతానికి చెందిన ప్రముఖ యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎస్.శర్మయాజీ సహకారంతో ఆలయ అర్చకులు ఎన్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ హోమం చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ హోమం చేసిన వారికి సకల బాధలు తొలగిపోయి, మనసులో కోరిన కోర్కెలు నెరవేరుతాయని అర్చకులు తెలిపారు. మధ్యాహ్నం దాతల సహకారంతో ఆలయ ప్రాంగణంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

రోడ్డు పనుల పరిశీలన

- రహదారుల సమస్యకు ప్రభుత్వ ప్రాధాన్యం
- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న రహదారుల సమస్యను పరిష్కరించడానికి అధిక ప్రాధాన్యం ఇచ్చిందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు తామరఖండి-బక్కుపేట గ్రామాల మధ్య రూ.20 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్వతీపురం నియోజకవర్గంలో దీర్ఘకాలంగా ప్రజలు ఎదుర్కొంటున్న రహదారుల సమస్య పరిష్కరించడానికి కోట్లాది రూపాయల వ్యయంతో లింక్ రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. ఈ నేపథ్యంలో సీతానగరం మండలంలోని పణుకు వలస- చినంకలాం, గుచ్చిమి-సీతారాంపురం, పులిగుమ్మి-రేపటివలస, అంటిపేట నుంచి కోమటిపల్లి, కోమటిపల్లి-దయానిధిపురం, కారాడ నుంచి పణుకువలస, హెచ్.కారాడవలస- నిడగల్లు, మరిపివలస- బూర్జ, లక్ష్మీపురం-వెంకటాపురం, మరిపివలస-సూరంపేట మీదుగా పెద్దబొండపల్లి, పెదబొండపల్లి వరకూ బీటీ రోడ్డు వేశామన్నారు. చినభోగిలి నుంచి గాదెలవలస వరకూ బీటీ రోడ్డు వేయాల్సి ఉందన్నారు. అలాగే పెదంకలాం నుంచి సుమిత్రాపురం మీదుగా బురద వెంకటాపురం గ్రామానికి అనుసంధానంగా బీటీ రోడ్డు వేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వై గౌరీశ్వరి, పీఏసీఎస్ చైర్మన్ ఎం.మన్మథరావు, మాజీసర్పంచ్ ఎం.శంకరరావు, గ్రామ వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉపసర్పంచ్ కుటుంబానికి పరామర్శ

ఇటీవల పితృవియోగం పొందిన మండలంలోని బల్లకృష్ణాపురం ఉపసర్పంచ్ జగన్నాథం కుటుంబాన్ని ఎమ్మెల్యే అలజంగి జోగారావు గురువారం పరామర్శించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఎన్.సుశీల, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, మాజీ సర్పంచ్ డి. సింహాచలం, మాజీ వీఆర్వో కూర్మినాయుడు, ఎన్.రామకృష్ణ, పి. ఈశ్వరనారాయణ పాల్గొన్నారు.

రైతులకు భద్రత



మిల్లుకు వచ్చిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ ఎన్వీ రమణ

సీతానగరం: మండలంలోని రైతులకు భద్రత కల్పించడానికి సత్వర చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ ఎన్వీ రమణ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన రైస్ మిల్లులకు కొనుగోలు కేంద్రాల నుంచి వస్తున్న ధాన్యాన్ని, ధాన్యంలో తేమశాతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'మిచాంగ్' తుఫాన్ కారణంగా కలెక్టర్ నిషాంత్ కుమార్ ఆదేశాల మేరకు రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. వర్షాలకు ధాన్యం తడిసిపోయినా ఆన్‌లైన్ పనిచేయకపోయినా మిల్లులకు ధాన్యం తరలించినట్లు చెప్పారు. మిల్లులకు వస్తున్న ధాన్యంలో తేమ శాతాన్ని గుర్తించి రైతులనుంచి కొనుగోలు చేయాల్సి ఉందన్నారు. మిల్లర్లు మిల్లు సామర్థ్యాన్ని అనుసరించి బీజీలు తీసి రైతులకు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో మిల్లర్లు, ఆర్ఐ ఎస్ శ్రీనివాసరావు, ఏఓ ఎస్.అవినాష్, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

అధికారుల క్షేత్రస్థాయి పర్యటన



పట్టణంలో జాతీయరహదారిమీదుగా ప్రవహిస్తున్న వరదనీరు

సాలూరు: మిచాంగ్ తుఫాన్ ప్రభావం వల్ల జరిగిన పంటల నష్టంపై అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించారు. గురువారం ఉదయం నుంచి తుఫాన్ పూర్తిగా తెరిపిచ్చింది. దీంతో ఎంపీడీఓ పార్వతి, ఏఓ అనురాధ పండా తదితరులు జీగిరాం, నెలిపర్తి తదితర ప్రాంతాల్లో పర్యటించారు. మండలంలో సుమారు 150 ఎకరాల్లోని వరి పంటకు నష్టం వాటిల్లిందని ఏఓ ఈ సందర్భంగా తెలిపారు. నెలిపర్తి సమీపంలో బైపాస్‌రోడ్డు వద్ద వరద నీరు నిలిచిపోగా రైతులు జేసీబీ సహాయంతో నీటిని వేగావతిలోకి మళ్లించారు. చెరుకుపల్లి గెడ్డ ఉప్పొంగడంతో సాలూరు సమీపంలో పొలాలు నీట మునిగిపోగా ఫిలడెల్ఫియా కమ్యూనిటీ ఆస్పత్రి ఎదురుగా జాతీయ రహదారి మీదుగా వరదనీరు ప్రవహించింది.



నెలిపర్తి సమీపంలో జేసీబీతో వరదనీటి మార్గాన్ని వేగావతిలోకి మళ్లిస్తున్న దృశ్యం

జాతీయస్థాయి అథ్లెటిక్ పోటీలకు వంగర విద్యార్థులు



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

వంగర: జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీలకు వంగర జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన దేవకివాడ అశోక్, కొమరాపు చందు ఎంపికయ్యారు. గత నెల 24, 25 తేదీలలో పల్నాడు జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం ముద్దాడ రమణమ్మ తెలిపారు.

ఈ మేరకు విద్యార్థులను పాఠశాల ఆవరణలో గురువారం అభినందించారు. కార్యక్రమంలో పీఈటీ బి. కవిత, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు కోసం దరఖాస్తు చేసుకోండి

రామభద్రపురం: అర్హులైన యువతీయువకులంతా ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ ఎ.సులోచనరాణి కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలు సేకరించిన ఓటు దరఖాస్తులను గురువారం పరిశీలించిన ఆమె ఓటు నమోదు చేయించుకునేందుకు మరో రెండు రోజులు మాత్రమే గడువు ఉందన్నారు. ఇప్పటికే రెండు దఫాలుగా ఓటు నమోదుకు ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టామని ఆఫ్‌లైన్ ద్వారా 480 దరఖాస్తులు, ఆన్‌లైన్ ద్వారా 250 పైబడి దరఖాస్తులు వచ్చాయన్నారు.

ఈ నెల 9వ తేదీ వరకు మాత్రమే ఓటునమోదుకు గడువు ఉన్నందున 18 ఏళ్లు నిండిన వారంతా ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అలాగే పాత ఓటరు జాబితాలో పేర్లు, ఫొటోల్లో తప్పొప్పులుంటే వాటిని కూడా సవరించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీటీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.